క్లుప్తంగా

'పది' విద్యార్థులకు శిక్షణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జెడ్పీ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సోమవారం ఒకేషనల్ ట్రైనింగ్‌లో భాగంగా ఆటోమోటివ్ ట్రేడ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాతిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ఎంపిక చేసుకున్న విద్యార్థులకు అదనపు శిక్షణ ఇచ్చి ఒకేషనల్ ట్రైనింగ్ పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్ ఇస్తారని పేర్కొన్నారు. దసరా సెలవులు 10 రోజుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్షణ, ఒకేషనల్ ట్రైనర్ అరవింద్, ఐసీఏ ఎడ్యుకేషనల్‌స్కిల్స్ ఆధ్వర్యంలో 23 మంది విద్యార్థులను వివిధ రకాల మెకానిక్ షాపులకు, కార్‌గ్యారేజ్‌లకు పంపుతామని తెలిపారు. ఇందులో శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

చినకాకానిలో డెంగీ కేసు నమోదు



మంగళగిరి: చినకాకాని హాయ్‌ల్యాండ్ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి డెంగీ అని తేలడంతో స్థానికులు కలవరపడ్డారు. నగర కమిషనర్ అలీం బాషా సోమవారం డెంగీ సోకిన వ్యక్తిని పరిశీలించారు. స్థానికంగా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో విలీన గ్రామాల్లో పారిశుధ్యం ఇబ్బందికరంగా తయారవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఫిరంగిపురం: పొనుగుపాడు గ్రామంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మికుల సంఘం కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. కమిటీ గ్రామ అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించలేదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే ఆలోచనలో ఉన్నాయన్నారు. కేంద్రం నిధులు విడుదల చేశామని చెబుతున్నా ఆచరణలో అమలు కావడంలేదన్నారు. కార్మికులు అంతా ఏకతాటిపై నిలిచి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కరరావు, సహాయ కార్యదర్శి ఎస్. మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ



ఫిరంగిపురం: మండలంలో రేపూడి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపర్చిన ఈవీఎం, వీవీ ప్యాట్లలను ఆర్డీవో కె.శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్ తెరిచి అందులో భద్రపర్చిన ఈవీఎంలు, వాటి భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. సెక్యూరిటీ రికార్డులు, విద్యుత్ సరఫరా, సీసీ టీవీలు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఆర్అండ్‌బీ ఏఈ అరుణకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని 8 వార్డు ఆంజనేయ కాలనీలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి సంతకాల సేకరణ చేశారు. సీపీఎం నేతలు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దోమలుపెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఇదే ప్రాంతంలో పిల్లలు కుక్కకాల బారిన పడుతున్నారని వాటిని అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల నివారణకు కాలువల్లో ఫాగింగ్ చేయాలన్నారు. అనంతరం 5వ సచివాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, రామారావు, సుందరరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ఉత్సవం

- ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాల వద్ద భక్తజన కోలాహలం
- క్యూలు ఆధ్యాత్మిక తరంగాలు

మంగళగిరి టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు విద్యుత్ దీప కాంతుల నడుమ కొత్త శోభను సంతరించుకున్నాయి. మొదటిరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని అమ్మవారు శ్రీ రాజ్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన సాయిబ్రహ్మారెడ్డి, గీతారెడ్డి దంపతులు వ్యవహరించారు.

- పాత మంగళగిరి దుర్గానగర్‌లోకనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. నిర్వాహకులు ఇంటూరి దుర్గాప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.
- మంగళగిరిలో గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఈఓ గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- మంగళగిరి పట్టణ పరిధిలోని నవదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జీఆర్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- మంగళగిరి నగర పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్డులో ఉన్న శ్రీ కాళీమాత ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని శ్రీ మహంకాళి దేవస్థానంలో బాల త్రిపురసుందరీదేవిగా అమ్మవారం సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. దుగ్గిరాల గంగాపార్వతి సమేత శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

మేడికొండూరు: డోకిపర్రు పోలేరమ్మ దేవాలయం వద్ద అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు.

మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరి, రాజీవ్ గృహకల్పరోడ్డు, కోర్టు సమీపంలో అఖిలాండేశ్వరి ఆలయాలలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.



కాళీమాత ఆలయంలో కుంకుమార్చన

తాడేపల్లి పరిధిలో..

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని శ్రీ గంగా బాలత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని శ్రీ గంగా బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఉండవల్లి రెడ్ల రామమందిరంలో అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి చండీహోమం నిర్వహించారు. చిర్రావూరు, ఇప్పటం, వడ్డేశ్వరం, కొలనుకొండ, సీతానగరం, పెనుమాక, గుండిమెడ, నులకపేట, మహానాడు తదితర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



తాడేపల్లిలో గంగాబాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో..



శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ..



జీఆర్ స్కూల్ సమీపంలో అమ్మవారు



పాతమంగళగిరి కనకదుర్గ ఆలయంలో ..

కార్మికుల పని గంటలు పెంచడం అన్యాయం

తాడేపల్లి రూరల్: కార్మికుల పని గంటలను 8 నుంచి పెంచుతూ సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లిలోని కృష్ణనగర్‌లో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పనిగంటలను 13 గంటలుగా పెంచుతామని ఎక్కడా చెప్పలేదని గుర్తు చేస్తున్నామన్నారు. కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు ఇప్పటి వరకు కార్పొరేషన్ అధికారులు ఇవ్వలేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పనిగంటలను 13 గంటలకు పెంచితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు దుర్గారావు, కార్మికులు సతీష్, మేరీ, లక్ష్మి, కామాక్షి, రాంబాబు, బాలయ్య, అనూష, కొండయ్య, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులతో సీఐటీయూ నాయకులు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఫిరంగిపురం: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. పొనుగుపాడులో 1,2 జగనన్న కాలనీలను సోమవారం ఆయన పరిశీలించారు. కాలనీ వాసుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అప్పారావు మాట్లాడుతూ జగనన్న కాలనీల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని వీరి అభివృద్ధి పాలకులకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెప్పడమేకానీ ఆచరణలో లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, గ్రామ కార్మిక సంఘం అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కరరావు, కాలనీవాసులు ఉన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు, మస్తాన్‌వలి

రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

భీమనవారిపాలెం వద్ద ఘటన

మేడికొండూరు: గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమినేని వారి పాలెం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. భీమినేనివారిపాలెం గ్రామానికి చెందిన తోక శ్రీను (43), పాలపర్తి రమేష్ గొర్రెల మందతో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో గుంటూరు నుంచి మాచర్ల వైపు అతి వేగంగా వస్తున్న కారు వెనుకగా వారిని ఢీ కొట్టింది. కారును నడుపుతున్న వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఘటనలో తోక శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా, పాలపర్తి రమేష్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఒక గొర్రె చనిపోగా, నాలుగు గొర్రెలకు కాళ్లు విరిగాయి. విషయం తెలిసిన వెంటనే మేడికొండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. సీఐ నాగూర్ మీరా సాహెబ్ ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



మృతుడు తోక శ్రీను (ఫైల్)

సంస్కృతీ సంప్రదాయాలు తెలియజేయడానికే..



అమ్మవారి వేషధారణలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

తాడేపల్లి రూరల్: స్థానిక వంశీ టాలెంట్ స్కూల్‌లో ముందస్తుగా సోమవారం దసరా ఉత్సవాలను నిర్వహించారు. సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయడానికే వేడుకలు చేస్తున్నామన్నారు. అమ్మవారి వివిధ రూపాలను విద్యార్థినులకు అలంకరించి నృత్య కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి శిబిరాలు

కొల్లిపర: అసంక్రమిత వ్యాధుల నివారణ కోసం, మహిళలు ఆరోగ్యవంతులుగా ఉండటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్త్ అభియాన్ పథకం ద్వారా బుధవారం కొల్లిపర గ్రామంలోని సీహెచ్‌సీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో మహిళలకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, తల్లి బిడ్డ సేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్ , మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందించనున్నట్లు తెలిపారు.అంటే కాకుండా వైద్య సిబిరంలో గైనకాలజిస్టు , జనరల్ సర్జరీ, దంత వైద్యంకు ప్రత్యేక సీనియర్ వైద్యులు ఉంటారని తెలిపారు.

మ్యాజిక్ డ్రెయిన్లతో కాలుష్య నివారణ

దుగ్గిరాల: మురుగునీటి పారుదలకు నూతన విధానాల్లో మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తే ఎటువంటి కాలుష్యం ఉండదని షేక్ జబీన్ అన్నారు. సోమవారం దుగ్గిరాల మండలం చింతలపూడిలో మ్యాజిక్ డ్రెయిన్ల శంకుస్థాపన షేక్ జబీన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కల్పనలో భాగంగా మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తున్నామన్నారు. కమ్మెల సత్యనారాయణ ఇంటి నుంచి యర్రంశెట్టి శివయ్య ఇంటి వరకు 80 మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ, సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం, వసంతనగర్, ఆరోగ్యనగర్, జగనన్న కాలనీల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ఫిరంగిపురం: భారీ వర్షాల కారణంగా అతిసార వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ తప్పని సరిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఫిరంగిపురం వైద్యురాలు శ్వేత అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, ఆరోగ్య సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటిని మరిగించేటప్పుడు బుడగలు వచ్చి కనీసం ఒక్క నిముషం పాటు ఉడికేవరకు ఉంచాలన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఎక్కువరోజులు నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. జ్వరం, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కన్పిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసాదరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రవిబాబు, వైద్యాధికారి యానీగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

నగలు అపహరణ

దుగ్గిరాల: తాళాలు వేసి ఉన్న ఇంటిలో బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. దుగ్గిరాల మండల కేంద్రంలో కొల్లిపర జ్యోతి కుటుంబం నివసిస్తోంది. వారు మూడు రోజుల క్రితం ఊరెళ్లారు. అప్పుడు ఎవరూ లేని సమయంలో కొందరు ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు దొంగిలించారు. జ్యోతి సోమవారం తెల్లవారుజామున వచ్చిన చూడగా సుమారు 98 గ్రాములు బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. స్థానిక పీఎస్‌లో కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు దుగ్గిరాల ఎస్సై వెంకటరవి తెలిపారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

మేడికొండూరు: ఆధునిక డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై మహిళా రైతులకు అవగాహన కల్పించడానికి మేడికొండూరు గ్రామంలో డిజిటల్ ఫైనాన్షియల్ లిటరసీపై సోమవారం సదస్సు నిర్వహించారు. టీజేపీఎస్ కాలేజీ లెక్చరర్ ప్రసాదరావు, యూనియన్ బ్యాంక్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంజలి పాల్గొన్నారు. ప్రసాదరావు మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ద్వారా ఆర్థిక సేవలు ఎలా అందుకోవాలో వివరించారు. యూపీఐ (ఫోన్‌పే, గూగుల్‌పే), ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఆదాయం, ఖర్చులు, పొదుపు, పెట్టుబడులు, అప్పులు, వడ్డీ వంటి అంశాలను తెలియజేశారు. డిజిటల్ లావాదేవీలలో సైబర్ భద్రత చాలా ముఖ్యమని,ఓటీపీలను ఎవరితోనూ పంచుకోకూడదని, స్కామ్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, పబ్లిక్ వైఫైని ఉపయోగించి బ్యాంకింగ్ సేవలు వాడకూడదని సూచించారు. అంజలి మాట్లాడుతూ బ్యాంక్ అందించే శిక్షణ, రుణాలను వివరించారు. కార్యక్రమంలో సామ్రాజ్యం, మహిళా రైతులు, గ్రామ పెద్ద బుల్లారావు డిజిటల్ లావాదేవీలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

హామీలు నెరవేర్చిన జగన్

- చంద్రబాబు సూపర్‌సిక్స్ అన్నారు.. ప్రజల ఆశలు నీరుగార్చారు
- వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏడాదిలోపు అమలులోకి తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, ఇచ్చిన హామీలను నెరవేర్చి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) కొనియాడారు. తాడేపల్లిరూరల్ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం పార్టీ గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు అధ్యక్షతన బాబు షూ్యరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీవీఆర్ మాట్లాడుతూ జగన్ పాలనలో అందరికీ నవరత్న పథకాలు అందాయన్నారు. కూటమి నేతలు ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనేక ఆరోపణలు చేశారన్నారు. ఆయన ఇచ్చిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అదనంగా ప్రజలకు మేలు చేస్తామని అధికారం చేజిక్కించుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించకుండా ఆ పార్టీ నాయకులు ఒక్క ప్రెస్‌మీట్ కూడా నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరిస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా వారిని ప్రశ్నించరు కదా అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల్లోకి వెళ్లి సమస్యలపై ప్రశ్నిస్తే తప్ప హామీలను అమలు చేయలేని ఈ కూటమి నాయకులు ప్రజలకు ఎలా మేలు చేస్తారో అర్థం చేసుకోవచ్చన్నారు.

మహిళలకు రూ.1500 ఇస్తామన్నారు ఏదీ

రాష్ట్రంలో 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 45 ఏళ్ల నిండిన ప్రతి పేద మహిళకు సంవత్సరానికి 18 వేలు ఇస్తానని హామీ ఇచ్చి సంవత్సరంలోపే అమలు చేశారని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనులను టీడీపీ వారే ప్రచారం చేస్తున్నారని, మరి ఆయన పరిపాలన ఏ విధంగా చేశారో, ఎంతమందికి మేలు జరిగిందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ప్రస్తుత అధ్యక్షుడు అమరా నాగయ్య, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు పులగం సందీప్ రెడ్డి, నియోజకవర్గ యువజన నేత గోపిరెడ్డి, మండల కమిటీ నాయకులు కళ్ళం పిచ్చిరెడ్డి, తోకల రాంబాబు, ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు చంద్రరావు, ఎస్టీ విభాగం అధ్యక్షులు బాణావత్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మండల యువజన ఉపాధ్యక్షులు నల్లపు రాంబాబు, కుంచనపల్లి గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులు, మంగళగిరి మండల యువజన విభాగ అధ్యక్షులు కొండమడుగుల గోపిరెడ్డి, బిరుదుగడ్డ విజయేంద్రరావు, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు నల్లపు రవితేజ, సెక్రటరీ వసంత్, కోశాధికారి కె. వంశీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలను తక్షణమే చెల్లించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ కోరారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులకు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కమిటీ సభ్యులు సూర్యప్రకాష్‌తో కలసి ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 293 రోజుల నుంచి కార్మికులు దీక్షలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు కార్మికులు తమకు రావాల్సిన బకాయిలకోసం వివరించారని, తమ పార్టీ అధికారంలోకి వస్తేసమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు నాగేశ్వరరావు, ఆశీర్వాదం, దేవరాజు, కార్మికులు వై. రమాదేవి, ఇమాంబి, శారమ్మ, దుర్గాభవాని, సువర్ణకుమారి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నేతలు

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు

తాడేపల్లి రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారని తర్జాతీయ రోటరీ ఐఎంఎస్ గేట్స్ డైరెక్టర్ కృష్ణబాబు చెప్పారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ మహిళా సాధికారతపై అందరూ కలసి పని చేసినప్పుడే నిజమైన సమానత్వ సమాజం సాధ్యమవుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ రూతు రమ్య, ఫుడ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. పద్మావతి, స్నేహార్పి ఫౌండేషన వ్యవస్థాపకురాలు భారతీదేవి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ రూతు రమ్య

పరిశుభ్రతలో వీధి విక్రయదారుల భాగస్వామ్యం

మంగళగిరి టౌన్: నగర పరిశుభ్రతలో వీధి విక్రయదారులు భాగస్వాములు కావాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలోని కౌన్సెలింగ్ హాల్‌లో సోమవారం వీధి విక్రయదారుల రుణమేళా జరిగింది. ఈ సందర్భంగా అలీమ్‌బాషా మాట్లాడుతూ వీధి విక్రయదారులు గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రాంతంలో వీధి విక్రయదారుల కోసం మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, బ్యాంకు మేనేజర్లు, నగరపాలక సంస్థ సిబ్బంది, వీధి విక్రయదారుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అలీమ్‌బాషా

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

తాడేపల్లి రూరల్: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటుకు కృషి చేయాలని కేఎల్‌యూ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ కోరారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌తో కలిగే హానికర ప్రభావాలపై వర్సిటీ ఎన్ఎస్ఎస్, సీఎస్సీ–2 విభాగాల ఆధ్వర్యంలో వలంటీర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడండి అంటూ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకండి, ప్రకృతిని కాపాడండి, ప్లాస్టిక్ లేని భవిష్యత్ సురక్షితం, కాటన్ బ్యాగ్స్ వాడండి అంటూ అవగాహన కల్పించారు. అనంతరం కమ్యూనిటీ హాల్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి, సీఎస్సీ–2 విభాగాధిపతి డాక్టర్ బి. తిరుపతి రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు. వారిని వర్సిటీ వీసీ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందించారు.



ర్యాలీ చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com